పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఈ నెల 21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా పల్స్ పోలియో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2009 నుంచి ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదన్నారు. జిల్లాలో ఐదేళ్ల వయసు గల 1,87,204 పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. 1,315 పోలియో బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమ నిర్వహణకు 5,520 మంది ఉద్యోగులకు విధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు పోలియో చుక్కలు వేయించకపోతే సిబ్బంది ఈ నెల 22, 23 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయాలన్నారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డి, డిఎంహెచ్ఒ గీతా బాయి, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి దేవ సుధాలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి భీమవరం బాలోత్సవం

ఎస్ఆర్‌కెఆర్‌లో రెండు రోజులపాటు మూడో పిల్లల సంబరాలు
ప్రారంభించనున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి
హాజరుకానున్న జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి, ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, డిఇఒ నారాయణ, డిటిఒ
తరలిరానున్న 6 వేల మంది విద్యార్థులు
ఏర్పాట్లు పూర్తిచేసిన బాలోత్సవ నిర్వహణ కమిటీ

బాలోత్సవాలకు సిద్ధమైన వేదిక

ప్రజాశక్తి - భీమవరం

బాలల ప్రతిభా పాటవాలు, శక్తి యుక్తులు పెరుగుతున్నాయి. పిల్లలు ఆటలాడడం కాకుండా సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్, టీవీల ద్వారా చూడటానికి పరిమితం అవుతున్నారు. విజ్ఞాన విషయాలన్నీ స్మార్ట్ ఫోన్ చేతిలోనే ఉంటున్నా పిల్లల నైపుణ్యం కొద్ది మందిలో మాత్రమే పెరుగుతున్నాయి. మూఢ భావాలు మాత్రం త్వరగా పెరుగుతున్నాయి. పాఠ్య పుస్తకాలతో కుస్తీ, పాఠాల బట్టీయం, హోమ్‌వర్క్‌లతో సతమతమౌతున్నారు. ఇదే బడి పిల్లల జీవితంగా మారింది. ఇంటా బయటా ఆనందం వెల్లువిరిసేది. ఆహ్లాదం వెల్లువెత్తేది చిన్నారులతోనే. కుటుంబ బంధాలు, స్నేహ భావాలూ కుచించుకుపోతున్నాయి. మంచి విలువలు మరుగున పడుతున్నాయి. సహకారతత్వం సడలుతోంది. పెద్దవారికి, సాటివారికి సేవ చేయాలన్న భావన కొరవడుతోంది. పిల్లలు ఎన్ని నేర్చుకున్నా వాటిని ప్రదర్శించేందుకు వేదికలు పెద్దగా అందుబాటులో ఉండడం లేదు. చిన్న కుటుంబాలు పెరిగి, కథలు, కబుర్ల ద్వారా ధైర్యం, సేవాగుణం వంటి వాటి గురించి తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు చెప్పే అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మన భీమవరం బాలోత్సవం పేరిట గత రెండేళ్ల నుంచి నిర్వహణ కమిటీ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది కూడా భీమవరం బాలోత్సవాల మూడో పిల్లల సంబరాలు నిర్వహించేందుకు నిర్వహణ కమిటీ అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 12, 13వ తేదీల్లో రెండు రోజులపాటు ఎంతో అట్టహాసంగా నిర్వహించనున్నారు. 12వ తేదీ ఉదయం 9 గంటలకు జాతీయ జెండా, బాలోత్సవం జెండాల ఆవిష్కరణ, అనంతరం సభతో ప్రారంభం కానున్నాయి. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ బాలోత్సవాలు ప్రారంభించనున్నారు. రెండో రోజు జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి, డిటిఒ మోహమ్మద్ ముజాహర్ బేగ్, సమగ్ర శిక్ష ఎపిసి అధికారి పి.శ్యాంసుందర్ బాలోత్సవాలను ప్రారంభిస్తారు. భీమవరం పట్టణం, మండలం, వీరవాసరం, పాలకోడేరు, ఉండి, కాళ్ల, ఆకివీడు మండలాల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటుకు చెందిన 590 పాఠశాలల్లోని ఎల్‌కెజి నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ బాలోత్సవంలో పాల్గొనున్నారు. తరగతి గదుల్లో 15 -అకడమిక్, 4 వేదికలపై 18 - కల్చరల్ అంశాలలో విద్యార్థులు ప్రదర్శనలు ఏకకాలంలో నిర్వహించనున్నారు. ప్రతిరోజూ 3 వేల మందికి తగ్గకుండా విద్యార్థులు వారితోపాటు టీచర్లు, తల్లిదండ్రులు, నిర్వాహకులు పాల్గొంటారు. అందరికీ అల్పాహారం, భోజనాలు, స్నాక్స్, పానీయాలు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రారంభ సభ, బహుమతి ప్రదానోత్సవంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులను భాగస్వాములను చేశారు. బాలోత్సవంలో పాల్గొనే విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు, విజేతలకు మెడల్స్, మెమెంటోలు అందజేస్తారు. ఈ పిల్లల పండుగలో అంతా పాల్గొని విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ విజ్ఞప్తి చేసింది. పిల్లలు ఒత్తిడి లేకుండా కష్టపడి, ఇష్టపడి చదివే వాతావరణం కావాలి. విశాల మనస్తత్వం, ఐక్యతా భావం పెరగడానికి, సృజనాత్మకతను అభివృద్ధి చేయడానికి, పిల్లల్లో శాస్త్ర సాంకేతిక పరిశోధనల పట్ల ఆసక్తిని ప్రోత్సహించడానికి ఒకేసారి, ఒకేచోట విద్య, సాంస్కృతిక అంశాలలో ప్రతిభా పాటవ ప్రదర్శనకు, విద్యార్థుల నైపుణ్యాలు తోటి విద్యార్థులు చూసేవిధంగా బాలోత్సవాలు కన్నుల పండుగగా జరగనున్నాయి.

ఎస్ఆర్‌కెఆర్ కళాశాల

అంగన్‌వాడీలు మెరుగైన సేవలందించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్లు అందిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

అంగన్‌వాడీ సిబ్బంది స్మార్ట్ ఫోన్ల ద్వారా మేలైన సర్వీసులు అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్, మానిటరింగ్ సిబ్బందికి కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి చేతుల మీదుగా స్మార్ట్ ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది స్మార్ట్ ఫోన్ల ద్వారా మేలైన సర్వీసులు అందించాలన్నారు. డిజిటలైజేషన్ కోసమే స్మార్ట్ ఫోన్లు అందజేశామన్నారు. జిల్లాలో 1,626 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 64 మంది సూపర్‌వైజర్లు, ఏడుగురు బిపిసిలకు స్మార్ట్ ఫోన్లు అందించడం జరిగిందన్నారు. డిజిటలైజేషన్ సేవల కోసం స్మార్ట్ ఫోన్లు ఉపయోగించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సమాచార రికార్డింగ్ మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. పోషణ ట్రాకర్ బాల సంజీవిని తదితర అంశాలను ఇక ఆన్‌లైన్‌లో ఎప్పటికపుడు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారి డి.శ్రీలక్ష్మి, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ పి.చంద్రశేఖర్, బిపిసిలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

15న వందే భారత్ ప్రారంభం

ప్రారంభించనున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లాలో మొట్ట మొదటిగా వందే భారత్ రైలు నడవనుంది. డాక్టర్ ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ నుంచి విజయవాడ వరకూ వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 15 నుంచి నరసాపురం వరకూ పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. వందేభారత్ రైలుకు అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 15న నరసాపురం నుంచి చెన్నయ్ వెళ్లే ఈ ఎక్స్‌ప్రెస్‌ను కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ప్రారంభించనున్నారు. జిల్లాకు ఇదే తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఏర్పాట్లపై రైల్వే అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. విజయవాడ నుంచి నరసాపురం వచ్చే ట్రాక్‌ను గురువారం అధికారులు పర్యవేక్షించారు. ప్రధానంగా ట్రాక్ పైకి పశువులు రాకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే నరసాపురం నుంచి విజయవాడ మధ్య ఈ రైలుకు కేవలం మూడే స్టాప్‌లు ఉన్నాయి. నరసాపురం, భీమవరం, కృష్ణా జిల్లాలోని గుడివాడలో మాత్రమే ఆగనుంది. ఈ రైలు చెన్నయ్‌లో ఉదయం 5.30 గంటలకు బయల్దేరి విజయవాడ మధ్యాహ్నం 12.29, తరువాత గుడివాడ, భీమవరం మీదుగా 2.10 గంటలకు నరసాపురం చేరుకుంటుంది. తిరిగి అదేరోజు నరసాపురంలో మధ్యాహ్నం 2.50 గంటలకు బయల్దేరి రాత్రి 11.45 గంటలకు చెన్నయ్ చేరుకుంటుందని దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు.

జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

వివిధ శాఖల్లో పురోగతిలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తేవడంతోపాటు, జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్లో గురువారం ఎపి ఇడబ్ల్యూఐడిసి, సమగ్ర శిక్ష, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్ శాఖల ఇంజినీరింగ్ విభాగాల పర్యవేక్షణలో పిఎంశ్రీ వర్క్స్, మనబడి మన భవిష్యత్తు ఫేజ్ వన్ అండ్‌టు, జల జీవన్ మిషన్ పనులు, జిల్లాలోని భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు మున్సిపాల్టీలు, ఆకివీడు నగర పంచాయతీల్లో చేపట్టిన, చేపట్టాల్సిన పనుల పురోగతిపై జెసి రాహుల్‌కుమార్ రెడ్డితో కలిసి కలెక్టర్ నాగరాణి సమీక్షించారు. మనబడి మన భవిష్యత్తు ఫేజ్ వన్ కింద 430 పనులను రూ.14.17 కోట్లతో చేపట్టి పనులను నూరుశాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఫేజ్‌టులో 1,076 పనులను రూ.56.17 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటిలో రూ.16.81 కోట్ల విలువైన 507 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మరో 394 పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. పాఠశాలల్లో రన్నింగ్ వాటర్‌తోపాటు మరుగుదొడ్లు 106 పనులు, విద్యుదీకరణతో పాటు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల ఏర్పాటు 103, తాగునీటి సరఫరా 107, ఫర్నీచర్ ఏర్పాటు 107, పాఠశాలల రంగులు వేయడం 106, పెద్ద, చిన్న మరమ్మతులు చేయడం 107, కో-లోకేటెడ్ అంగన్‌వాడీ సెంటర్లు 32 తదితర పనులను మనబడి మన భవిష్యత్తు ఫేజ్ టులో మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 27 పిఎంశ్రీ పాఠశాలలు ఉన్నాయని, వీటిలో ఆరు పాఠశాలకు కెమిస్ట్రీ ల్యాబ్‌ల ఏర్పాటు, 21 పాఠశాలకు ప్లే గ్రౌండ్ ఏర్పాటు, ఏడు పాఠశాలకు కిచెన్ గార్డెన్ ఫెన్సింగ్ ఏర్పాటు, ఒక పాఠశాలలో పిఎంసి ఫేజ్ టు, ఆరు పాఠశాలకు రైన్ వాటర్ హార్వెస్టింగ్ పనులు, రెండు పాఠశాలలకు ర్యాంపు, హ్యాండ్ రైల్స్ ఏర్పాటు, ఆరు పాఠశాలలకు పిఎంశ్రీ ఫేజ్ కింద 7 పనులు మొత్తం రూ.221.73 లక్షల అంచనా వ్యయంతో మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటిలో 33 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. సమగ్ర శిక్ష ఎపిసి పి.శ్యామ్ సుందర్, పబ్లిక్ హెల్త్ ఇఇ విజయ్, జిల్లా ఆర్అండ్‌బి అధికారి శ్రీనివాసరావు, భీమవరం, నరసాపురం, పాలకొల్లు, ఆకివీడు, తాడేపల్లిగూడెం, తణుకు మున్సిపాల్టీల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రతి ఒక్కరికీ రక్తాన్ని అందించేందుకు తమ వంతు సహాయంగా అన్ని శాఖలూ రక్తదాన శిబిరాల్లో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. రక్తం కొరతను తగ్గించేందుకు ప్రభుత్వ విభాగాల ఉద్యోగులు ప్రతి నెలా 1వ శుక్రవారం, 3వ శుక్రవారం రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఈనెల 12న జిల్లా కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రక్తదాన శిబిరంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొనాలని తెలిపారు. ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం ప్రారంభించి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. గత 12 నెలల్లో వివిధ ప్రభుత్వ శాఖల నుండి ఇలాంటి ప్రేరణతో మొత్తం 1,166 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు.

ఎంఎల్ఎ గారూ.. ఇది 'ధర్మ'మా..!

- ఉంగుటూరు నియోజకవర్గంలోని కొల్లేరు రైతుల్లో తీవ్ర ఆందోళన
- అన్‌సర్వే భూముల్లో రబీ సాగుపై పొలిటికల్ డ్రామా
- ప్రజాప్రతినిధుల మాటలకు.. క్షేత్రస్థాయి పరిస్థితికి పొంతన కరువు
- రైతులను అడ్డుకుంటున్న అటవీ అధికారులు.. దిక్కుతోచని అన్నదాత
- నారుమడులకు సమయం ఆసన్నమైనా ఏఒక్కరికీ పట్టని దుస్థితి
- అటవీ శాఖ మంత్రిగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నాదెండ్ల మనోహర్
- జనసేన ఎంఎల్ఎ ఉన్నచోట రైతుల పరిస్థితి అగమ్యగోచరం

సాగు చేసుకునేందుకు వెళ్లకుండా తోకలపల్లిలో రైతులను అడ్డగింత(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరుప్రతినిధి

ఉంగుటూరు నియోజకవర్గంలోని కొల్లేరు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొల్లేరును ఆనుకుని ఉన్న అన్‌సర్వే భూముల్లో రబీ సాగుపై పొలిటికల్ డ్రామా కొనసాగుతోంది. రబీసాగుపై ప్రజాప్రతినిధులు చెబుతున్న మాటలకు.. అక్కడ జరుగుతున్న తీరుకు ఏమాత్రం పొంతన లేకుండాపోయింది. దీంతో ఎంఎల్ఎగారూ.. ఇది ధర్మమా అంటూ అక్కడి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్లేరులోని అన్‌సర్వే భూముల్లో వరిసాగుపై వందల ఏళ్లుగా లేని సమస్యను ఇప్పుడే ఎందుకు తెరపైకి తీసుకొచ్చారనే ప్రశ్న అక్కడి రైతులను వేధిస్తోంది. తమకు తెలియని ఏదో పొలిటికల్ డ్రామా సాగుతుందనే చర్చ సర్వత్రా నడుస్తోంది. నారుమడులకు సమయం దగ్గర పడటంతో రబీ సాగుపై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఉంగుటూరు, దెందులూరు, కైకలూరు, ఉండి నియోజకవర్గాల పరిధిలో కొల్లేరు ప్రాంతం విస్తరించి ఉంది. దాదాపు 77 వేల ఎకరాల్లో ఈ కొల్లేరు ఉంది. కొల్లేరులో అక్రమ చేపల చెరువుల తవ్వకాలపై దాదాపు 25 ఏళ్లుగా సుప్రీంకోర్టులో కేసు నడుస్తోంది. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో చెరువులను ధ్వంసం చేశారు. అప్పుడు సైతం వరిసాగు చేసుకునే రైతులను ఎటువంటి ఇబ్బందీ పెట్టలేదు. నిడమర్రు మండలంలోని అడవికొలను, పెదనింద్రకొలను, తోకలపల్లి, బైనేపల్లి, చానమల్లి, ఆముదాలపల్లితోపాటు ఉంగుటూరు మండలంలోని అప్పారావుపేట వంటి అనేక గ్రామాల్లో రైతులు వందల ఏళ్లుగా రబీలో వరిసాగు చేస్తున్నారు. డిసెంబర్‌లో నారుమడులు వేసుకుని ఏప్రిల్ నాటికి అక్కడి నుంచి పంట తీసుకొచ్చేస్తారు. కొల్లేరును ఆనుకుని ఉన్న అన్‌సర్వే భూముల్లో వరిసాగుకు ప్రభుత్వాలే అనుమతులిచ్చాయి. ఆ పొలాలకు పన్నులు సైతం చెల్లించారు.

వేల ఎకరాల సాగుపై ఎందుకీ దొంగాట

ఉంగుటూరు నియోజకవర్గంలో కొల్లేరు అన్‌సర్వే భూములు దాదాపు మూడు వేల ఎకరాల వరకూ ఉన్నట్లు చెబుతున్నారు. ఈ భూముల్లో రైతులు వరిసాగు మాత్రమే చేస్తున్నారు. 25 ఏళ్లుగా సుప్రీంకోర్టులో కొల్లేరు అంశం నడుస్తోంది. ఇప్పుడు సుప్రీంకోర్టులో ఉందంటూ వరిసాగును అడ్డుకుంటున్న పరిస్థితి. కొల్లేరు అన్‌సర్వే భూములన్నీ పేదరైతులే సాగు చేసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నా ప్రజాప్రతినిధులుగాని, జిల్లా అధికారులుగాని పట్టించుకోని పరిస్థితి. గత నవంబర్ 13న వేలాది మంది ఉంగుటూరు నియోజకవర్గానికి చెందిన కొల్లేరు రైతులు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. స్థానిక ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు వచ్చి రైతులను తీసుకుని ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అయినప్పటికీ ఏమాత్రం ప్రయోజనం లేకుండాపోయింది. నవంబర్ 26న తోకలపల్లిలో రైతులు సాగు చేసుకునేందుకు పొలాల్లోకి వెళ్తుండగా అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం తీవ్ర అలజడి రేపింది.

ఎంఎల్ఎ ధర్మరాజు పట్టించుకోవడం లేదని ఆవేదన

ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు కొల్లేరు రైతుల వ్యథను ఏమాత్రం పట్టించుకోవడం లేదని జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. అటవీశాఖ మంత్రిగా జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఉన్నారు. కొల్లేరు అంశం ఆయన పరిధిలోకే వస్తుంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా జనసేన కీలకనేత నాదెండ్ల మనోహర్ ఉన్నారు. ఉంగుటూరు ఎంఎల్ఎగా జనసేనకు చెందిన పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. అయినప్పటికీ కొల్లేరులో వరిసాగు చేసుకునే విషయంలో న్యాయం జరగని పరిస్థితి. డిసెంబర్ ఒకటో తేదీన ఉంగుటూరు నియోజకవర్గంలో సిఎం పర్యటించారు. ఆ సందర్భంగా ఎంఎల్ఎ కొల్లేరులో రబీసాగు అంశాన్ని లేవనెత్తకపోవడం చర్చకు దారితీసింది. నవంబర్ 26న డిఆర్‌సి సమావేశంలోనూ ఈ అంశం ప్రస్తావన లేకపోవడం అందరినీ విస్మయపర్చింది. సిఎంకు తమ గోడు చెప్పుకుందామనుకున్న తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి రైతులను సభకు రాకుండా అడ్డుకున్నారు. నారుమడులు వేసే సమయం ఆసన్నమైంది. ఇప్పటికైనా కొల్లేరు అన్‌సర్వే భూముల్లో రబీ సాగుకు అనుమతివ్వాలని రైతులు కోరుతున్నారు. ఎంపీ పుట్టా మహేష్, ఎంఎల్ఎ ధర్మరాజు కొల్లేరు రైతుల దాళ్వాసాగు సమస్యను వెంటనే పరిష్కరించాలని అంతా కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ సైతం సమస్యను పరిష్కరించాలని రైతులు వేడుకుంటున్నారు.

7లోపు కార్మికులకు జీతాలు చెల్లించాలి

మున్సిపల్ కమిషనర్‌కు ఎఐటియుసి, సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి - తణుకు

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల జీతాలు ప్రతినెలా ఏడో తేదీ దాటకుండా చెల్లించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ కోరారు. గురువారం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్కర్స్‌కు అవసరమైన పనిముట్లు ఇవ్వాలని, పెరుగుతున్న పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లకు ప్రతినెలా జీతాలు చెల్లించాలని, వారికి జిఒ 36 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి, సిఐటియు, మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు నీలాపు ఆదినారాయణ, మందుల ముత్తయ్య, సోమి పద్మ, గండ్రాపు శ్రీనివాసరావు, మీసాలు శిరీష, మార్లపూడి బర్న, కాకి వెంకటరమణ, కొంబత్తుల రవికుమార్ బోడపాటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

జెఎన్‌వి.గోపాలన్

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - ఆకివీడు

జనవరి 4న విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. మహాసభ ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక వ్యవహార పేట, దుంపగడప రైస్ మిల్లుల కూడలి వద్ద రైస్‌మిల్లు కార్మికులతో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోపాలన్ పాల్గొని మాట్లాడారు. అఖిల భారత మహాసభలో ప్రతి ఒక్కరూ పాల్గొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లో నష్టాలను తెలుసుకోవాలన్నారు. ఈ నాలుగు కోడ్‌లను కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయులు సమైక్యంగా తిప్పి కొట్టాలన్నారు. కష్టజీవులందరూ సమైక్యతతో తిప్పికొట్టి తిరిగి హక్కులు సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, బుర్ర సత్యం, బడుగు ఏడుకొండలు, పైలా శ్రీను, ఎర్ర శ్రీనివాసు, తమ్మిశెట్టి కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగల్తూరు : సిఐటియు 18వ అఖిల భారత మహాసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మొగల్తూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చలో విశాఖ వాల్ పోస్టర్‌ను గురువారం అంగన్‌వాడీలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల పనిని దోపిడీ చేసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రూ.26,000 కనీస వేతనం ఇవ్వాలని, బిల్డింగ్ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ హక్కుల కోసం విశాఖలో ఈ నెల 31 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకూ జరిగే మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.పెద్దింట్లు, ఎ.సీత, ఎస్.సారమ్మ, డి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

పెనుమంట్ర : సిఐటియు ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని పెనుమంట్రలో గురువారం ఇంటింటికీ వెళ్లి ఫండ్ క్యాంపెయిన్ చేపట్టారు. ఈ క్యాంపెయిన్‌లో సిఐటియు మండల కన్వీనర్ చిత్తరంజన్, జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు కూసంపూడి సుబ్బరాజు, ఆంజనేయులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

నిట్‌లో రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం: రక్తదాత ప్రాణదాతతో సమానమని పలువురు వక్తలు సూచించారు. ఎపి నిట్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, లయన్స్ క్లబ్ తాడేపల్లిగూడెం సంయుక్త ఆధ్వర్యంలో సంస్థ ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ జి.రవికిరణ్ శాస్త్రి, ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డీన్ వి.సందీప్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ప్రతి రక్తపు బొట్టు ఆయువు పట్టువంటిదని తెలిపారు. తల్లి జన్మనిస్తే రక్తదాత పునర్జన్మనిస్తారని చెప్పారు. విద్యార్థులు ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని తెలిపారు. ఆచార్యులు కృష్ణమూర్తి, రాజేశ్వరరెడ్డి, సంతోష్ కుమార్ రక్తదానం చేసి విద్యార్థుల్లో స్ఫూర్తినింపారు. ఏలూరు, తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రులకు చెందిన వైద్యులు రమ్యశృతి, సోనియా మోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ అధికారులు పండ్లు, గిఫ్ట్, లయన్స్ క్లబ్ సభ్యులు ఫ్రూటీలు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. అసోసియేట్ డీన్ రాజేశ్వరరెడ్డి కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ అధికారులు సుబ్రహ్మణ్యం, శివ సాయిరామకృష్ణ, ఆదిత్య, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్‌ను ఈ నెల 13న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి తెలిపారు. గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, కుటుంబ వివాదాల కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, బ్యాంకు లావాదేవీలు తదితర కేసులను పరిష్కరిస్తారని, ప్రతిరోజూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ప్రీ లోక్‌అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజీయోగ్యమైన కేసుల్లో మధ్యవర్తిత్వం ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి కేసుల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 13,800 కేసులను రాజీయోగ్యమైనవిగా గుర్తించామని, 33 బెంచ్‌లను ఏర్పాటు చేశామని, కక్షిదారులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ పాల్గొన్నారు.

యంత్రాల సాయంతో కోస్తున్న వరినాట్లు

ముమ్మరంగా వరి మాసూళ్లు

తేమ శాతం తగ్గిన ధాన్యాన్ని మిల్లులకు తరలింపు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో తుపాను వాతావరణం తొలగిపోయి, ఎండలు కాస్తుండడంతో పలుచోట్ల పొలాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే కోతలు పూర్తయ్యి రోడ్డు పక్కన, పుంత గట్ల మీద వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచిన ధాన్యాన్ని రైతులు, కౌలు రైతులు ఆరబెట్టుకుంటున్నారు. తేమ శాతం తగ్గిన ధాన్యాన్ని కొందరు బస్తాలకు ఎత్తి, మిల్లులకు తరలిస్తున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న పొలాల్లో కోత మిషన్లు దిగి, జోరుగా పనులు సాగిస్తున్నాయి.

ఏడు వేల ఎకరాల్లో కోతలు పూర్తి..

మండలంలో ఉన్న 12 వేల 419 ఎకరాల వరిపొలాల్లో సుమారు 7 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయినట్టు మండల వ్యవసాయాధికారి బి.దేవీ స్వరూప తెలిపారు. ఇప్పటికే ధాన్యం ప్రొక్యూర్మెంట్ టార్గెట్ 28,989 ఉండగా అందులో 9,800 మేరకు పూర్తయ్యిందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం మిగిలిన వ్యవసాయ భూముల్లో వరి కోతలు వేగవంతంగా జరుగుతున్నాయని, రైతులకు అవసరమైన సంచులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

లస్కర్ల బకాయి వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

వశిష్ట గోదావరి కుడి ఏటిగట్టు ఎగువ సెక్షన్ సిద్ధాంతం జలవనరుల శాఖలో పనిచేస్తున్న లస్కర్లకు గత ఏడు నెలలుగా వేతన బకాయిలు ఉన్నాయని కార్మికులు తెలిపారు. గురువారం సిద్ధాంతం లస్కర్లను కలిసిన సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వరదలు వస్తే 24 గంటలు పని చేసే లస్కర్లకు ప్రభుత్వం సంవత్సరానికి రెండుసార్లు వేతనాలు చెల్లిస్తుందని, నెల నెలా వేతనాలు ఇవ్వకుండా వారిని నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న ఏడు నెలల బకాయిలు తక్షణం చెల్లించాలని, లేకపోతే ఆందోళన చేపడుతామని అన్నారు. వీరికి పిఎఫ్ ఇఎస్ఐ వంటి సంక్షేమ పథకాలు లేవని, సంవత్సరానికి 12 నెలలు నెలలు అయితే 10 నెలలకే వేతనాలు చెల్లిస్తారని, పని 365 రోజులు చేయిస్తారని విమర్శించారు. ప్రధానంగా వరద సమయంలో ఇసుక సంచులు పేర్చడం, లైటింగ్ ఏర్పాటు చేయడం వంటి పనులు నిర్వహిస్తారని, ఒడ్డు కోతలు, గేట్లు(బ్రీచ్లు) పర్యవేక్షణ, ఆనకట్ట గేట్లు ఎత్తడం, దించడం, రాళ్ల పగుళ్లు రిపేర్ చేయడం వంటి పనులన్నీ చేస్తూ ఉంటారని తెలిపారు. ప్రస్తుతం సిద్ధాంతంలో నలుగురు లస్కర్లు ఉన్నారని, నిబంధనల ప్రకారం కిలోమీటరుకు ఐదుగురు ఉండాలని అన్నారు. సిద్ధాంతం ఎగువ సెక్షన్ పరిధిలో 45 కిలోమీటర్లు ఉంది. వర్షాకాలంలో 24 గంటలు పని చేస్తారన్నారు. ప్రస్తుతం జల వనరుల శాఖలో 30 నుండి 40 శాతం ఖాళీలు ఉన్నాయని, వీటిని తక్షణం భర్తీ చేయడం ద్వారా కార్మికులపై పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రూ.10,500కు జిఎస్‌టి రూ.300 కోత పోను రూ.10,200 వస్తుందన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని 12 నెలలకు వేతనాలు ఇవ్వాలని, ఏడు నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని లేకపోతే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లస్కర్లు కడలి చింతరావు, దాసిరెడ్డి పెదకాపు, జాస్తి ప్రభాకర్, యాతం మాధవరాయుడు, సిద్ధాంతం సిఐటియు నాయకులు కె.రత్నం రాజు పాల్గొన్నారు.

ఎల్ఎన్.పురం పంచాయతీ ఉప సర్పంచిగా ఆశ

కాళ్ల: ఎల్ఎన్.పురం గ్రామపంచాయతీ ఉప సర్పంచిగా ఏలేటి ఆశ ఎన్నికయ్యారు. గురువారం ఎల్ఎన్ పురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎన్నికల ప్రత్యేక అధికారి సిహెచ్ఎస్.వెంకట రెడ్డి అధ్యక్షతన ఉప సర్పంచి ఎన్నిక నిర్వహించారు. 3వ వార్డు సభ్యురాలైన ఏలేటి ఆశను ఉప సర్పంచిగా ఏకగ్రీవంగా వార్డు సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి టి.నాగరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బోదకాలు నివారణకు రక్త పరీక్షలు

గణపవరం: జాతీయ ఫైలేరియా బోదకాలు నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం అర్ధవరంలో 305 మందికి పరీక్షలు చేసినట్లు మలేరియా అధికారి డాక్టర్ ఎన్.క్రాంతి కుమార్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తపరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించి చర్యలు తీసుకోవటానికి అవకాశం ఉటుందని చెప్పారు. ఈ వ్యాధి క్యూలక్స్ అనే దోమ కుట్టడం వల్ల వస్తుందని చెప్పారు. వ్యాధి వల్ల జ్వరం, చలి, శరీరంపై వాపులు, అలాగే పుండ్లు కలుగుతాయని చెప్పారు. వ్యాధి నివారణకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డిఇసి మాత్రలు అందజేస్తున్నట్లు డాక్టర్లు ఓంకార్‌నాద్, కిరణ్మయి తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ.జాలాది విల్సన్ బాబు, జి.కృష్ణంరాజు, ఎంఎస్.యేహాన్, ఎస్.దివ్యభారతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కాళ్ల : నీతి, నిబద్ధతతో కూడిన క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శనీయమని రెవ. బి.జయరాజు తెలిపారు. గురువారం కాళ్లకూరు గ్రామంలో బివి.అప్పారావు ఆధ్వర్యాన, కె.సురేష్ బాబు అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. బి.మరియమ్మ ప్రారంభ ప్రార్ధనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెవ. బి.జయరాజు మాట్లాడుతూ లోకరక్షకుడు చెప్పినట్లుగా ప్రజలు సన్మార్గంలో నడవాలన్నారు. యువత ఇలాంటి భక్తి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందన్నారు. పెద్దలు క్రిస్మస్ కేక్ కోసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు జి.మోహన్‌రావు, ఏలీయ, మూర్తి, భూపతిదానియేలు, అశోక్, నరేష్, లక్ష్మణ్‌రావు, శివ, యోసేబు, మురళీ, జాషువా పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్‌సి శేషుబాబు జన్మదిన వేడుకలు

పాలకొల్లు : మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు పుట్టినరోజు సందర్భంగా పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ఫ్రూట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు మేకా రామకృష్ణ మేకా సిద్ధు, కాసాని కేశవరావు, జోగి వెంకటేశ్వరరావు, జోగి వడ్డీ కాసులు, దొమ్మేటి వెంకటరావు, దేవరపల్లి సత్తిబాబు, దేశంశెట్టి రాము, పెచ్చెటి కోటేశ్వరరావు, కడలి రామలక్ష్మి, గంటా వెంకన్న పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యాపారవేత్త చినవెంకన్న మృతి


చినవెంకన్న(ఫైల్ ఫొటో)

పెనుగొండ : పెనుగొండ పట్టణంలో గత ఆరు దశాబ్ధాలుగా ట్రంక్ వ్యాపారం రంగంలో విశేష గుర్తింపు పొందిన జయలక్ష్మి స్టీల్ ట్రంక్ అండ్ బక్కెట్స్ వర్క్స్ వ్యవస్థాపకులు చవక చిన వెంకన్న(89) బుధవారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. చిన వెంకన్న తన అన్నయ్య చవక పెద వెంకన్నతో కలిసి సుమారు అరవై సంవత్సరాల క్రితమే ట్రంక్ పెట్టెలు, బకెట్స్, ఇతర ఇనుప సామానులు తయారీకి వర్క్స్ ప్రారంభించి, పెనుగొండను రాష్ట్రవ్యాప్తంగా ట్రంక్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. వారి ట్రంకులు, బకెట్స్, నాణ్యతతో రాష్ట్రంలోని పలు జిల్లాలకు సరఫరా అవుతూ మంచి పేరును సంపాదించాయి. చిన వెంకన్న జీవితమంతా శ్రమానిరతుడిగా గడచింది. వ్యాపార అభివృద్ధితో పాటు, స్థానిక వ్యాపారులకు మార్గదర్శిగా నిలిచిన ఆయన నడవడిక అందరికీ ఆదర్శంగా ఉండేది. ఆయన అన్నయ్య పెద వెంకన్న 14 సంవత్సరాల క్రితం, భార్య జయలక్ష్మి అయిదు సంవత్సరాల క్రితం మరణించారు. చిన వెంకన్నకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. చవక చిన వెంకన్న మృతిపట్ల స్థానిక ట్రంక్ వ్యాపారులు, వ్యాపార సంఘ నాయకులు, పలువురు కూటమి నేతలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

గణపవరంలో ఫుట్ పెట్రోలింగ్

గణపవరం: గణపవరం పోలీస్ శాఖ ఆధ్వర్యాన గురువారం గణపవరం నుండి సరిపల్లి వరకు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిడమర్రు సిఐ నక్కా రజనీకుమార్, గణపవరం ఎస్ఐ ఎ.మణికుమార్ వాహనదారులకు వాహన చలానాలు, పార్కింగ్‌పై అవగాహన కల్పించారు. స్కూల్స్ వద్ద మత్తుపదార్ధాల నియంత్రణ, అమ్మకాల నిషేదంపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ అడ్డులేకుండా వాహనాలను నిలుపదల చేయాలని సూచించారు. కార్యక్రంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సేవలు డిజిటలైజేషన్ కోసమే స్మార్ట్ ఫోన్లు

ఎంఎల్ఎలు అంజిబాబు, నాయకర్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాష్ట్రంలోని అంగన్‌వాడీ సిబ్బందికి డిజిటల్ సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం స్మార్ట్ ఫోన్స్ అందిస్తుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. గురువారం భీమవరం ఎంఎల్ఎ కార్యాలయంలో సూపర్‌వైజర్, మానిటరింగ్ సిబ్బందికి ఎంఎల్ఎ అంజిబాబు స్మార్ట్ ఫోన్స్ అందించారు. 192 అంగన్‌వాడీ సిబ్బందికి స్మార్ట్ ఫోన్స్ అందించడం జరుగుతుందన్నారు. సేవలు డిజిటలైజేషన్ కోసమే స్మార్ట్ ఫోన్స్ అని, ఈ నిర్ణయం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సమాచార రికార్డింగ్ మరింత వేగవంతం అవుతుందన్నారు. ప్రతి అంశం ఇక ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు అవుతాయన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ లక్ష్మీకాంతం, టి.అనిల్ కుమారి, విమల కుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.


భీమవరం టౌన్ : స్మార్ట్ ఫోన్లు అందజేస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

మొగల్తూరు : గర్భవతులకు, బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వ సేవలు మెరుగైన రీతిలో అంగన్వాడీలు అంకితభావంతో అందజేస్తున్నారని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ కొనియాడారు. మొగల్తూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ప్రభుత్వం సరఫరా చేసిన స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ బి.ఊర్మిళ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు కూడా అమలయ్యేలా ప్రభుత్వానికి విన్నవిస్తానని అన్నారు. అంగన్వాడీలకు ఏ సమస్య వచ్చినా తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం నియోజకవర్గంలో ఉన్న 193 అంగన్వాడీ కేంద్రాల్లోని టీచర్లకు, ఏడుగురు సూపర్వైజర్లకు ప్రభుత్వం సరఫరా చేసిన 5జి ఫోన్లను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఉప సర్పంచి బోణం నరసింహారావు, మెట్ల రాంబాబు, మెండు రాజేష్, ఐసిడిఎస్ పర్యవేక్షకులు ఎస్.పద్మావతి, పి.విజయ కుమారి, ఎం.శ్రీదేవి, సిహెచ్.దుర్గ భవానీ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - మొగల్తూరు

అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 12వ తేదీ శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ఆందోళన కార్యక్రమంలో అంగన్వాడీలందరూ పాల్గొనాలని ఐసిడిఎస్ మొగల్తూరు ప్రాజెక్టు పరిధి అధ్యక్ష కార్యదర్శులు కె.నీలిమ, జి.పెద్దింట్లు పిలుపునిచ్చారు. అంగన్వాడీల సమస్యలైన కనీస వేతనం, అంగన్వాడీలకు సంక్షేమ పథకాల అమలు, అన్ని యాప్లను ఒక యాప్‌గా మార్చి సెంటర్ నిర్వహించడం, లబ్ధిదారులకు ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ, మెను ఛార్జీలు పెంచి, ఉచితంగా గ్యాస్ ప్రభుత్వం సరఫరా చేయాలని, ప్రీస్కూల్ విద్యార్థులకు తల్లికి వందన పథకం అమలు చేయాలని, ఐదు సంవత్సరాల పిల్లలందరూ అంగన్వాడీ సెంటర్‌లోనే ఉండాలే ప్రభుత్వం జీఒ తీసుకురావాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారం కోరుతూ చేపట్టే ధర్నాలో అంగన్వాడీలందరూ పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

పతకాలు సాధించిన విద్యార్థులు

ఫెన్సింగ్ పోటీల్లో మండపాక విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి - తణుకు

ఈనెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ 14 బాలికల టీమ్ విభాగంలో బి.భవాని బంగారు పతకం, బాలుర టీమ్ విభాగంలో ఎస్.లోహిత్, జి.ఆనంద్ శ్రీనివాస్‌లు కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.ఫణిశ్రీ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణను గ్రామ సర్పంచి జానా వెంకటలక్ష్మి, ఉప సర్పంచి జి.నగేష్, టిడిపి మండల అధ్యక్షులు ఆత్మకూరి రామకృష్ణ, జనసేన నాయకులు జానా శ్రీనివాస్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.


మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

భావితరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించాలి

డాక్టర్ గాదిరాజు రంగరాజు

ప్రజాశక్తి - ఉండి

భావితరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఉండి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఉండి హైస్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.రామలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులంతా తలో మొక్క నాటాలన్నారు. వృక్షో రక్షతి రక్షితః అని చెట్లను సంరక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని తెలిపారు. నాటిన మొక్కలను విద్యార్థులకు దత్తత ఇచ్చారు. ప్రతి విద్యార్థి మొక్కలను సంరక్షించాలని వారు సూచించారు. క్లబ్ కార్యదర్శి పెన్మెత్స రంగప్రసాదరాజు, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ ముదునూరి శివరామరాజు, డిసి మెంబర్ కన్నెగంటి రూత్ కళ, దాతలు వైస్ ప్రెసిడెంట్ ద్వారంపూడి నారాయణ రెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్ సత్తి బ్రహ్మారెడ్డి, లయన్ గొట్టుముక్కల రాము, టీచర్లు మధు సుధానరావు, శ్రీనివాస్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిఎన్ఆర్‌లో సెమినార్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వాతావరణంలో వ్యర్థ పదార్థాల వ్యవస్థాపక నిర్వహణలో అవకాశాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర విభాగం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా కోఆర్డినేటర్ రోహిత్ విద్యానంద్ మాట్లాడుతూ వ్యర్థ పదార్థాల నుండి పునరుత్పాదక శక్తిని పొందడం, బయో ఆర్గానిక్ ఎరువులను తయారు చేసే విధానం, ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులను పెంపొందించడం గురించి వివరించారు. నీటిని శుద్ధీకరించడం, వ్యర్థ పదార్థాల నుండి గుణమైన వస్తువులను తయారు చేయడం వంటి విషయాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కళాశాలలో ఏర్పాటుచేసిన వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి అధ్యక్షత వహించగా ఫిజికల్ డైరెక్టర్ రమేష్, డాక్టర్ మణిమాల సంధ్య, ప్రసన్న, విజయలక్ష్మి, నోబుల్ రాజ్, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇంధన వనరులు భావితరాలకు అందించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఇంధనాన్ని పొదుపు చేసి భావితరాలకు వనరులను కాపాడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యాన ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి చేతుల మీదుగా జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల గోడపత్రికను విద్యుత్ శాఖ ఇంజినీర్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు బిఇఇ వారి సౌజన్యంతో జరగనున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు మహోద్యమంగా నిర్వహించాలన్నారు. ప్రజల్లో ఇంధన పరిరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యాన జిల్లా అంతటా పట్టణ, గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా విద్యుత్ శాఖ అధికారి పి.ఉషారాణి, విద్యుత్ శాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మృతి

ప్రజాశక్తి - ఆకివీడు

రత్నకుమారి(ఫైల్ ఫొటో)

ఆకివీడు ప్రాజెక్టు ఐసిడిఎస్ సూపర్వైజర్‌గా పనిచేస్తున్న పిఆర్.రత్నకుమారి(56) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె సుమారు గత రెండు నెలలుగా అనారోగ్యంతో వైద్య సహాయం పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఆమె ఇంటి వద్ద ఉదయం మరణించారు. సుమారు గత 23 సంవత్సరాలుగా అంగన్వాడీ సూపర్వైజర్‌గా పని చేస్తున్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ సూపర్వైజర్‌గా ఆమె మూడుసార్లు ప్రభుత్వ అవార్డులు అందుకున్నారు. అధికారికంగా ఆమె ఆకివీడుకి మాత్రమే సూపర్వైజర్ అయినప్పటికీ ప్రాజెక్టు పరిధితో పాటు జిల్లాలో పలువురికి సలహాలకు ఆమెను సంప్రదిస్తూ ఉంటారు. స్థానికంగా ఉంటున్న ఆమె ఇక్కడ మంచి ఉద్యోగిగా పలువురు ప్రశంసలు అందుకున్నారు.

సిఐటియు నివాళి : వృత్తిపట్ల అంకితభావం కలిగి ఉత్తమ సేవలు అందించిన రత్నకుమారి మరణం అంగన్వాడీ(సిఐటియు)కు తీరని లోటని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. ఆమె మృతదేహాన్ని సందర్శించి ఆయన పూలమాలవేసి నివాళులు ఘటించారు. వారి కుటుంబానికి సంతాపం ప్రకటించారు. ఆయన వెంట సిఐటియు మండల కో కన్వీనర్లు కె.తవిటి నాయుడు, పెంకి అప్పారావు, నాయకులు షేక్ వలి, అంగన్వాడీ నాయకులు కృష్ణకుమారి, ప్రమీల, దుర్గ, ఇరానీ దేవి రత్నకుమారికి నివాళి ఘటించారు.

ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తాం

రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని స్థానిక ఎంఎల్ఎ, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు మండల ప్రజా పరిషత్తు నూతన అధ్యక్షురాలిగా కట్టుబోయిన వెంకటలక్ష్మి ఎన్నిక, ప్రమాణస్వీకారం పుల్లా బాబి అధ్యక్షతన గురువారం జరిగింది. అనంతరం జరిగిన అభినందన సభలో ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజాపరిషత్తు అధ్యక్షులు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు, అధికారులందరూ అభివృద్ధి కార్యక్రమాలపై శ్రద్ధ వహించి పనులు వేగవతంగా పూర్తిచేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో అత్యంత ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో పరిపాలనను వేగవంతం చేశారని, ఈ వేగాన్ని అందరూ అందిపుచ్చుకోవాలని అన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఆయన కోరారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు నెరవేర్చాలని ఆయన కోరారు. డిడిఒ ప్రభాకర్ ఎన్నికల అధికారిగా ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటివరకూ వైసిపి చేతిలో ఉన్న పెంటపాడు మండల ప్రజా పరిషత్తు ఈ ఎన్నికతో జనసేనకు దక్కింది. కూటమి నాయకులు ఈతకోట తాతాజీ, దాసరి అప్పన్న, కిలపర్తి వెంకట్రావు, జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్, తోట రాజా, కసిరెడ్డి మధులత, కట్టుబోయిన కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

క్వాంటం టెక్నాలజీతో కంప్యూటింగ్ సామర్థ్యం

అంతర్జాతీయ సదస్సులో నిపుణుల వెల్లడి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

క్వాంటం టెక్నాలజీ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని అపారంగా పెంచే అవకాశం ఉంటుందని పలువురు అంతర్జాతీయ నిపుణులు పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యాన అల్గారి ధమ్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఐసిఎఎఎఐ-2025) అనే అంశంపై మూడు రోజులపాటు జరిగే మూడవ అంతర్జాతీయ సదస్సు గురువారం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి జనరల్ చైర్ సిఎస్‌సి హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎస్.రామకృష్ణమరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మలేషియాలోని యూనివర్సిటీ పుత్ర మలేషియా, ప్రొఫెసర్ డాక్టర్ హజిలీనా బింతి హమ్ దాన్ ముఖ్య అతిథిగా వచ్చి పాల్గొని మాట్లాడుతూ గతంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వ్యవసాయ రంగంలోనూ, హెల్త్ కేర్, ఫైనాన్స్, ట్రాన్స్‌పోర్టేషన్ అగ్రికల్చర్ వంటి అంశాల్లో ప్రధాన భూమిక పోషించేదన్నారు. అయితే ప్రస్తుతం వస్తున్న న్యూ కంప్యూటర్ టెక్నాలజీస్ అందుబాటులోకి వస్తున్నందున నూతన ఆలోచనలతోనూ, నూతన ఆవిష్కరణలతోనూ, నూతన అప్లికేషన్స్ మరింత ప్రగతి సాధించాలని ఆమె సూచించారు. ఐఐటి హైదరాబాద్ సిఎస్‌సి ప్రొఫెసర్ డాక్టర్ ఎంవి.పాండురంగారావు మాట్లాడుతూ క్వాంటం టెక్నాలజీస్ ద్వారా కంప్యూటర్జైజేషన్ అత్యంత వేగంగా సమర్థవంతంగా పనిచేసేలా చేస్తుందని పేర్కొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి శ్రీమహర్షి కన్సల్టెన్సీ ప్రయివేట్ లిమిటెడ్ సిటిఒ ఎం.శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు ఏర్పాటు చేసి నూతన సాంకేతికతపై అధ్యయనం చేసే అవకాశం కల్పించినందుకు సిఎస్‌సి డిపార్ట్మెంట్‌కి అభినందనలు తెలిపారు. ప్రోగ్రాం చైర్ సిఎస్‌సి హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎస్.రామకృష్ణమరాజు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ఆర్ఎన్‌వి.జగన్మోహన్, డాక్టర్ జిఎన్‌విజి.శిరీష మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సుకు పరిశోధకులు, కళాశాలల అధ్యాపకుల నుండి మంచి స్పందన వచ్చిందన్నారు. అంతర్జాతీయ సదస్సుకు వచ్చిన పేపర్లలో నిపుణులు పరిశీలించి ఆమోదించిన మేరకు సుమారు 117 పేపర్స్ ఆమోదించడం జరిగిందని తెలిపారు.

స్పేస్ టెక్నాలజీలో ఎపి నెంబర్ వన్ కావాలి

డాక్టర్ వి.శేషగిరిరావు

భీమవరం టౌన్ : స్పేస్ టెక్నాలజీలో ఎపి నెంబర్ వన్ కావాలనే ఉద్దేశ్యంతోనే ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్నాలజీ అకాడమీ(ఎపిఎస్ఎ) అమరావతి ఏర్పాటైందని ఫార్మర్ అసోసియేట్ డైరెక్టర్ షార్ డాక్టర్ వి.శేషగిరిరావు పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యాన ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్నాలజీ అకాడమీ అమరావతి, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల, అకాడమీ ఫర్ సైన్స్ టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్(ఎఎస్‌టిసి) హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యాన అడ్వాన్సింగ్ స్పేస్ సైన్స్ అండ్ సొసైటీ అనే అంశంపై వర్క్ షాప్ గురువారం సివిల్ ఇంజినీరింగ్ సెమినార్ హాల్లో జరిగింది. కార్యక్రమానికి డాక్టర్ టి.వంశీ నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇస్రో మాజీ శాస్త్రవేత్త డాక్టర్ శేషగిరిరావు మాట్లాడుతూ ప్రస్తుతం స్పేస్ ఎకానమీలో మన వాటా రెండు శాతం మాత్రమే ఉందని, దీనిని రానున్న కాలంలో 10 శాతానికి పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. స్పేస్ టెక్నాలజీలో సివిల్ ఇంజినీరింగ్ పాత్ర కూడా ఎంతో ఉందన్నారు. స్పేస్‌లో నిర్మాణాలు జరిగే అవకాశం వచ్చినప్పుడు అక్కడ కట్టడాలు ఏవిధంగా చేయాలనే దానిపై కూడా అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. రిమోట్ సెన్సింగ్ ప్రాధాన్యతను వివరిస్తూ దీని ద్వారా కోస్టల్ ఎరోజన్ చాలెంజ్ని అధిగమించటం, భూమిని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చేయటం వంటి అంశాలను కూడా అధ్యయనం చేయాలని ఆయన కోరారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ స్పేస్ టెక్నాలజీ వల్ల వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి ఎంతగానో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. వీటిని మరింత లోతైన అధ్యయనం చేసేందుకు ఇటువంటి వర్క్ షాప్‌లు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఇస్రో పూర్వపు డిప్యూటీ డైరెక్టర్ కెవి.రమణ, సివిల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ జి.శ్రీబాల, కళాశాల ఆర్ అండ్‌డి డీన్ డాక్టర్ టి.వంశీ నాగరాజు పాల్గొన్నారు.

అత్యాధునిక దంత సంరక్షణ సేవలు అభినందనీయం : ఎంఎల్ఎ

నరసాపురం: ప్రజలకు అత్యాధునిక దంత సంరక్షణ సేవలు ఇకపై అందుబాటులోకి తీసుకొనిరావడం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం నరసాపురం పట్టణంలోని కోవెల వీధిలో శ్రీడెంటల్ కేర్ మల్టీ హాస్పిటల్‌ను ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ పట్టణంలో పిల్లల దంత వైద్యశాల ప్రారంభించడం మంచి విషయమని డాక్టర్‌ను అభినందించారు. డాక్టర్ శ్రీలాస్య మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో అత్యాధునిక డెంటల్ ఇంప్లాంట్లు, ఆర్థోడాంటిక్స్(పళ్ల క్లిప్పింగ్), కాస్మెటిక్ డెంటిస్ట్రీ, రూట్ కెనాల్, చిన్నపిల్లలకు ప్రత్యేకమైన వైద్యం, సాధారణ దంత పరీక్షలు వంటి సమగ్ర సేవలను అనుభవజ్ఞులైన వైద్యుల బృందం పర్యవేక్షణలో అందిస్తున్నామన్నారు. ప్రజలకు నాణ్యమైన, అందుబాటు ధరలో దంత చికిత్స అందించాలనేది తమ ప్రధాన లక్ష్యమన్నారు. మెరుగైన దంత ఆరోగ్య సంరక్షణ సేవలను అందించే లక్ష్యంతో హాస్పిటల్ ఏర్పాటు చేసినట్లు డాక్టర్ లాస్య తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, ఆర్‌డిఒ దాసిరాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి చిన్న, నాయకులు కొల్లు పెద్దిరాజు, కోటిపల్లి సురేష్, పొన్నాల నాగబాబు పాల్గొన్నారు.

ఆసుపత్రి ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

బాలలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

మానవ సేవే మాధవ సేవని తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన ప్రముఖ సువార్త ప్రసంగికురాలు చంద్రు కళ్యాణి అన్నారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో 25 మంది హెచ్ఐవి బాధిత బాలలకు గురువారం ఆమె ధన సహాయంతో నూతన దుస్తులు బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వ్యక్తులను ఆదుకోవడమే నిజమైన దైవత్వం అనిపించుకుంటుందని, ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె కుటుంబ సభ్యులతో పాటు హాస్పిటల్ వైద్యురాలు, మానవత ఆత్మీయ కమిటీ డైరెక్టర్ ముత్యాల శ్రీనివాస్, కార్యదర్శి శ్రీవాత్సవ ప్రదీప్, సభ్యులు చిలుకూరి భీమన్న, బోళ్ల శ్రీనివాస్, ఆరుమిల్లి సురేష్, గుబ్బల ఫౌండేషన్ ఛైర్మన్ గుబ్బల ప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.

ప్రతాప్‌నాయుడు చిత్రపటానికి నివాళి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సరిపల్లి గ్రామంలో గురువారం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు తండ్రి బండారు ప్రతాప్ నాయుడు సంవత్సరీకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, ఆర్‌డిఒ దాసిరాజు పాల్గొని ప్రతాప్ నాయుడు చిత్రపటానికి నివాళి ఘటించారు.

రైతులు సర్వేకు సహకరించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - మొగల్తూరు

రైతులందరూ భూములకు సంబంధించిన ఆధారాలు అందించి సర్వేకు సహకరించాలని ఆర్‌డిఒ దాసిరాజు సూచించారు. మండలంలోని కాళీపట్నం పడమరలో తహశీల్దార్ కె.రాజకిషోర్ అధ్యక్షతన గురువారం ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. కాళీపట్నంలోని రైతుల భూ సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. రైతులందరూ సర్వేకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎఒ శ్రీనివాసరావుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆచంట

పంచాయతీ రికార్డులను, ఓచర్‌లను నరసాపురం డిఎల్‌పిఒ కార్యాలయానికి దౌర్జన్యంగా తీసుకెళ్లి ఓచర్‌లను తారుమారు చేసి విచారణ పేరుతో దళిత సర్పంచిలను వేధిస్తున్న ఎఒ శ్రీనివాస్‌రావుపై చర్యలు తీసుకువాలని కొడమంచిలి సర్పంచి సుంకర సీతారామ్, వైసిపి నాయకులు కోట వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. గురువారం విజయవాడలోని ఎపి ఎస్‌సి కమిషన్ రాష్ట్రకార్యదర్శికి వినతిపత్రం అందించారు. అనంతరం సుంకర సీతారామ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో దళిత సర్పంచిలను టార్గెట్ చేసుకుని రాజకీయ కక్ష సాధింపులకు తెరలేపరని ఆరోపించారు. ఆచంట నియోజకవర్గంలో టిడిపికి చెందిన గణపతినీడి రాంబాబు చేస్తున్న ఇసుక అక్రమ దందాపై పైస్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడం వల్ల పంచాయతీ అధికారులను బెదిరించి కొడమంచిలి, ఆచంట, పండిత విల్లూరు, జగన్నాథపురం, మార్టేరు తదితర గ్రామ పంచాయతీలపై విచారణ పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కొలేక దళిత సర్పంచినైనా తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న మాజీ సర్పంచి చిలుకూరి శ్రీను, బాలం వెంకటరమణ, గణపతినీడి రాంబాబు, ఓచర్‌లను తారుమారు చేసిన ఎఒ శ్రీనివాస్‌రావుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పశువుల దాణా పంపిణీ

పాలకొల్లు రూరల్: మండలంలోని తిల్లపూడిలో 50, వెలివెలలో 30 బస్తాలు పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై టిడిపి నేతలు పశువుల దాణా పంపిణీ చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతులను గాలికి వదిలేసి పట్టించుకోలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా అధిక ప్రాధాన్యతనిస్తుందని, నియోజకవర్గంలో మంత్రి రామానాయుడు కృషి వల్లనే పాడి రైతులకు ప్రభుత్వ 50 శాతం సబ్సిడీపై దాణా పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి టిడిపి మండల అధ్యక్షులు పాముల రజినీకుమార్ అధ్యక్షత వహించారు. సర్పంచి కందుల వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సాగ సత్యనారాయణ, ఎఎంసి ఛైర్మన్ కోడి విజయభాస్కర్, సొసైటీ ఛైర్మన్ బోడపాటి వెంకటనారాయణ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

నరసాపురం: నరసాపురం పట్టణంలోని రుస్తుంబాద 216 జాతీయ రహదారిపై గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం ఒంగోలు నుండి మండపేట స్క్రాప్ లోడుతో వెళ్తున్న లారీ ఆగి ఉన్న మరొక లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఢీ కొట్టిన లారీ ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఆగి ఉన్న లారీకి వెనుక భాగం కొంత ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

ప్రకటన
మహారాజశ్రీ అడిషనల్ సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) గుడివాడ వారి కోర్టులో
ఓఎస్.నెం.124/2024
బిట్వీన్:
బైరెడ్డి వెంకట నారాయణ రెడ్డి ....వాది
మరియు
1. వరిగంజి ఏసుదీవెన రత్నకుమారి
2. మొవ్వ కల్పన, భర్త : మర్రి సురేష్ కుమార్, వయస్సు 36 సం॥లు, పెట్రోలు బంకు వీధి, పీర్లబజారు, నూజివీడు, ఏలూరుజిల్లా. ... ప్రతివాదులు
పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మొవ్వ కల్పనకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపిననూ తీసుకోనందున పేపరు ప్రకటన ద్వారా దావా సమనులు అమలు జరుపుటకు కోర్టువారు ఉత్తర్వులు యిచ్చియున్నందున యిందుమూలముగా తెలియజేయటమైనది. కావున ది.09-01-2026వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీరు స్వయంగా గానీ, మీ తరపున న్యాయవాది గాని ఆక్షేపణలు వున్న యెడల తెలుపవలెను. లేని పక్షమున పరోక్షమున తీర్మానము చేయబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 09-01-2026.
ఇట్లు
డి. వీరయ్య, బి.ఎ., ఎల్ఎల్.బి.,
అడ్వకేట్, గుడివాడ.
సెల్ నెం.9989809390